క్లుప్తంగా

మగటపల్లిలో టీవీ నటుల సందడి



సందడి చేసిన బుల్లి తెర నటులు

మామిడికుదురు: మగటపల్లిలో ధనమ్మ, వనువులమ్మ వార్ల జాతర మహోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి టీవీ నటులు సందడి చేశారు. హాస్య నటులు అప్పారావు, నాగి, బాబీ, రాజమౌళి, వినోదిని, పవన్, హరిత వినోదం పండించారు. సింగర్స్ జయంత్, మౌనికయాదవ్, శిరీష, యాంకర్ సింధు తమదైన శైలిలో పాటలు పాడి నృత్యాలు చేస్తూ యువతను ఉర్రూతలాడించారు. ఈ కార్యక్రమాలను వీక్షించేందుకు భారీగా ప్రజలు తరలివచ్చారు.

నత్రజని అధికంగా వాడవద్దు

అంబాజీపేట: వరి పంటలో నత్రజని ఎరువును మోతాదుకు మించి అధికంగా వాడితే తెగుళ్లు, పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటుందని మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్ అన్నారు. పుల్లేటికుర్రు శివారు చినలంకలో సర్పంచ్ జల్లి బాలరాజు అధ్యక్షతన పొలంబడి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ నత్రజని ఎరువు అధికంగా వినియోగించడం వల్ల దిగుబడులు తగ్గడంతో పాటు పెట్టుబడులు అధికంగా ఉంటాయన్నారు. వరి నాట్లు వేసిన 40 రోజుల వరకు పురుగుమందులు వినియోగించకూడదన్నారు. అనంతరం సూడోమోనాస్, ఫాస్పరస్, బాక్టీరియా ఎరువులను రైతులకు రాయితీపై అందజేశారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకులు డి.పాండురాజు, రైతులు కొప్పిశెట్టి సుబ్బారావు, చిత్రపు దామోదర్, కొప్పిశెట్టి తాతారావు, నూకపెయ్యి చంటి, గుబ్బల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏసీగా లక్ష్మీనారాయణ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న లక్ష్మీనారాయణ

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్‌గా మాచిరాజు లక్ష్మీనారాయణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. మురముళ్ల వీరేశ్వరస్వామి దేవస్థానం ఏసీగా పనిచేస్తున్న లక్ష్మీనారాయణను అప్పనపల్లి ఇన్‌చార్జ్ ఏసీగా నియమించారు. ఇక్కడ ఏసీగా పని చేస్తున్న ఎంకేటీ నాగవర ప్రసాద్ సెలవు పెట్టడంతో ఆయన స్థానే లక్ష్మీనారాయణను ఇన్‌చార్జ్ ఏసీగా నియమించారు.

కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

ఆలమూరు: ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగిందని మండల సీపీఐ కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. సీపీఐ రాష్ట్రశాఖ పిలుపు మేరకు ఆలమూరులోని పోస్టాఫీస్ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలియజేశారు. రాష్ట్రానికి సంబంధించి బడ్జెట్‌లో కోత విధించడం జరిగిందని, విద్య వైద్యానికి నిధులు కేటాయించలేదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రజానాట్య మండలి సభ్యులు పాల్గొన్నారు.

నేడు మెగా వైద్య శిబిరం

అంబాజీపేట: రూరల్ డెవలప్‌మెంట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పుల్లేటికుర్రు జెడ్పీ హైస్కూల్‌లో శనివారం నిర్వహించనున్నట్లు ట్రస్ట్ సభ్యులు తెలిపారు. అమలాపురం కిమ్స్ ఆస్పత్రి వైద్యులతో రోగులను పరీక్షిస్తారన్నారు. స్థానిక హమ్మద్ హెల్త్‌కేర్ ఆధ్వర్యంలో డెంటల్ చెకప్ చేయనున్నారన్నారు. అలాగే లెప్రసీ వ్యాధిగ్రస్తులకు దుప్పట్లు, పండ్లు ఇవ్వనున్నామన్నారు.

బీసీ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం

మామిడికుదురు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా గుబ్బల మురళీకృష్ణ ఎన్నికయ్యారు. అమలాపురంలో జరిగిన సమావేశంలో జిల్లా సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం అధ్యక్షతన జరిగిందని మురళీకృష్ణ శుక్రవారం తెలిపారు. సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీ జి.మల్లికార్జునరావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా కర్రి సుబ్బరాజు, ఆర్థిక కార్యదర్శిగా వి.శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడిగా దుగ్గిరాల దుర్గాప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బొక్కా వీరవెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్‌గా కారాడి నరసింహరాజు, అమలాపురం టౌన్ ప్రెసిడెంట్‌గా అప్పారి హరిబాబు, టౌన్ గౌరవాధ్యక్షుడిగా విత్తనాల శ్రీనివాసరావు ఎన్నికయ్యారని చెప్పారు.

గుండె చికిత్సకు ఆర్థిక సాయం

అయినవిల్లి: మండలంలోని తొత్తరమూడి నేదునూరి వారి పేటకు చెందిన నేదునూరి ధనరాజు కుమార్తె గుండెకు రంధ్రం ఏర్పడింది. ఈ సమస్యతో చికిత్స పొందుతున్న ఆమెకు వెలువలపల్లి చెందిన గని రూ.పదివేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట మద్దా రాజా తదితరులు ఉన్నారు.

సంక్షేమమే పరమావధి

- ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు
- కూనవరంలో గడప గడపకూ..



కూనవరంలో మహిళకు సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

రాజోలు: సంక్షేమమే పరమావధిగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలన సాగుతోందని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం కూనవరంలో ఎమ్మెల్యే రాపాక గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటి పరిష్కారం కోసం అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను బలోపేతం చేసేందుకు సీఎం జగన్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, నాయకులు అప్పారి హరిబాబు, చెల్లింగి చినబాబు తదితరులు పాల్గొన్నారు.

రైలు కోసం శాంతియుత ప్రజా ఉద్యమం



నగరంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న రైల్వే సాధన సమితి ప్రతినిధులు

మామిడికుదురు: కోనసీమ రైల్వే సాధన సమితి ఆధ్వర్యంలో మన కోనసీమకు రైలు కోసం శాంతియుత ప్రజా ఉద్యమం కోసం ప్రజల్లో చైతన్యం తీసుకు వస్తున్నామని సమితి కన్వీనర్ వీఆర్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. నగరం హుస్సేనీ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో శుక్రవారం జరిగిన అవగాహన సదస్సుకు అసోసియేషన్ అధ్యక్షుడు మీర్జాఖాదం హుస్సేన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సమితి కన్వీనర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైల్వే లైన్‌పై ప్రజల్ని మభ్యపెడుతున్నాయన్నారు. రాజకీయ స్వప్రయోజనాల కోసం ఇకరిపై మరొకరు విమర్శలు చేసుకోవడం మినహా ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలన్న ఆలోచన ఏ ఒక్కరిలోనూ కనిపించడం లేదన్నారు. గోదావరి నదిపై నిర్మాణంలో ఉన్న మూడు రైల్వే లైన్ల నిర్మాణం నత్తనడకన నడుస్తుందన్నారు. దీనిపై ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకు వచ్చేందుకు కోనసీమ రైల్వే సాధన సమితి కృషి చేస్తుందన్నారు. కోనసీమ ప్రజల మనోభావాలకు అనుగుణంగా ప్రభుత్వాలు స్పందించాల్సి ఉందన్నారు. దీనిపై తక్షణం స్పందించి రైల్వేలైన్ నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేసే దిశగా కార్యాచరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సమితి ప్రతినిధులు కల్వకొలను తాతాజీ, సత్తా నాగేశ్వరరావు, వై.వెంకటేశ్వరరావు, సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, జాలెం సుబ్బారావు, బీఎస్ మూర్తి, ఉప సర్పంచ్ అన్వర్‌తాహిర్ హుస్సేన్, ముకరం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయమే సీఎం జగన్ ఎజెండా



ఎమ్మెల్యే రాపాకను కలసి కృతజ్ఞతలు చెబుతున్న ఏఎంసీ చైర్మన్ రోజా రమణి, శెట్టిబలిజ నాయకులు

మలికిపురం/రాజోలు: రాష్ట్రంలో సామాజిక న్యాయమే ప్రధాన అజెండాగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి ముందుకు సాగుతున్నారని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు పేర్కొన్నారు. రాజోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, పలువురు డైరెక్టర్లు శుక్రవారం రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావును కత్తిమండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద మర్యాద పూర్వకంగా కలిశారు. కమిటీ తమకు స్థానం కల్పించినందుకు ఎమ్మెల్యే రాపాకకు పుష్పగుచ్ఛం అందించి ధన్యవాదాలు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ పదవి శెట్టిబలిజలకు ఇవ్వడంపై రాజోలు తాలూకా శెట్టిబలిజ సంఘ నేతలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. మత్స్యకార వర్గానికి చెందిన తిరుమాని రాజు సతీమణి దుర్గకు ఏఎంసీ డైరెక్టర్ పదవి ఇవ్వడంపై మత్స్యకార నేతలు కూడా కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం అంకితభావంతో పని చేసిన ప్రతి ఒక్కరికీ పార్టీ అండగా ఉండి తగిన ప్రాధాన్యం ఇస్తుందని అన్నారు. రాబోయే 20 ఏళ్లు రాష్ట్రంలో వైఎస్సార్ సీపీయే అధికారంలో ఉంటుందని, అందరికీ అవకాశాలు లభిస్తాయని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్ పర్సన్ గుబ్బల రోజారమణి, గుబ్బల బాబ్జి, దొమ్మేటి ఉమా మహేశ్వరరావు, గెద్దాడ నాగేశ్వరరావు, గుబ్బల శ్రీనివాస్, గుబ్బల రమేష్, కట్లయ్య, కట్టా శ్రీనివాసరావు, కోళ్ళ వేణుప్రసాద్, చెల్లుబోయిన బుచ్చియ్య మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారికి నగదు సాయం



సాత్విక్‌కు నగదు అందిస్తున్న సంస్థ సభ్యులు

అంబాజీపేట: కాళ్ల ఆపరేషన్ కోసం ఓ చిన్నారికి ఫ్రెండ్స్ ఫరెవర్ హెల్పింగ్ సంస్థ శుక్రవారం నగదు సాయాన్ని అందించింది. సంస్థ సభ్యులు నాగబత్తుల శశి, ముత్తాబత్తుల హరి, నాగాబత్తుల జాను, బూసి రాంబాబు, ఎం.రాము, వరప్రసాద్, మాధవ్, ప్రసాద్, రాజేష్‌లు సమకూర్చిన రూ.18 వేల నగదును మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు చేతుల మీదుగా మాచవరం శివారు పోతాయిలంకకు చెందిన ఆరేళ్ల ఈతకోట సాత్విక్‌కు అందజేశారు. సాత్విక్ వైద్యానికి తమ వంతు సాయం అందించారు. వారికి సాత్విక్ తండ్రి వెంకట్ కృతజ్ఞతలు తెలిపారు.

కనీస వేతనాలు తగ్గకుండా పనిచేయాలి



ఉపాధి కూలీలకు అవగాహన కల్పిస్తున్న డ్వామా పీడీ

అంబాజీపేట: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనులకు వచ్చే కూలీలు రోజూ కనీస వేతనం తగ్గకుండా పనిచేసుకోవాలని డ్వామా పీడీ ఎస్.మధుసూదనరావు అన్నారు. మాచవరం శివారు పండువారిపేట వద్ద రోజ్‌గార్ దివాస్ కార్యక్రమంలో భాగంగా ఏపీఓ అడపా వెంకటకృష్ణ అధ్యక్షతన ఉపాధి హామీ కూలీలకు అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ జిల్లాలో 10,819 మంది కూలీలు 1644 వివిధ పనులు చేపడుతున్నారన్నారు. ప్రతి కూలీ రోజుకు 8 గంటలకు పనిచేస్తే కనీస వేతనం రూ.257 తీసుకోవచ్చన్నారు. ప్రతి నాలుగు గంటలకోసారి పని చేస్తున్న స్థలంలో ఫొటోలు రెండు సార్లు తీసి ఆన్‌లైన్‌లో నమోదు అయితేనే వేతనాలు వస్తాయనే విషయాన్ని కూలీలు గుర్తించాలన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని కూలీలు ఉదయాన్నే పనులకు వచ్చేల ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, టీఏ జి.నాగార్జున, ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఎం.శ్రీనివాస్, ఐ.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రావులమ్మ అమ్మవారి ఆలయంలో ఏకాహం



రావులమ్మని దర్శించుకుంటున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు, భక్తులు

అంబాజీపేట: కె.పెదపూడిలో వేంచేసిన రాజరాజేశ్వరి రావులమ్మ అమ్మవారి ఆలయంలో 20వ ఏకాహాన్ని శుక్రవారం నిర్వహించారు. ఏటా అమ్మవారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఏకాహం జరుపుతామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వేకువజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొన్నారు. ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. రావులమ్మ వారిని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, నాయకులు చింతపల్లి వెంకటేశ్వరరావు, వాసర్ల మరిడి, కుడుపూడి శ్రీనివాస్, అంబటి శ్రీను తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పారిశుధ్యానికి ప్రత్యేక చర్యలు

ఆలమూరు: గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడివారం (డ్రైడే)గా పాటించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సువర్చలా నాయుడు, పి.భవానీశంకర్ కోరారు. ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్రైడే ను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వర్లు, పి.ఉమ, సీహెచ్ బేబి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఫీల్డ్ ఓపీ క్లినిక్ ప్రారంభం



కేశవదాసుపాలెంలో ఓఎన్జీసీ ఫీల్డ్ ఓపీ క్లినిక్ ప్రారంభంలో సర్పంచ్ సరోజ, ఓఎన్జీసీ వైద్యులు

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెం పంచాయతీ వద్ద శుక్రవారం రాజమహేంద్రవరం ఓఎన్జీసీ సంస్థ ఆధ్వర్యాన ఫీల్డ్ ఓపీ క్లినిక్ ప్రారంభించారు. సర్పంచ్ మేడిది సరోజ పై క్లినిక్‌ను ప్రారంభించారు. ప్రతి నెలలో రెండు, నాలుగో శుక్రవారాలు నిర్వహించే ఈ క్లినిక్‌లో వైద్యం ఉచితంగా అందించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. అన్ని అనారోగ్య సమస్యలకు ట్రీట్‌మెంట్ ఉచితంగా ఇస్తామని, మందులు కూడా ఉచితంగా అందజేస్తామన్నారు. ఎంపీటీసీ ఉండపల్లి సాయికుమారి, మోరి గ్యాస్ కలెక్షన్ స్టేషన్ ప్రతినిధి శ్రీనివాస్, క్లినిక్ ఇన్‌చార్జ్ మెడికల్ డాక్టర్ అహ్మద్, వైద్యులు రామ్మోహన్, రమ్య, సిసిలి, శ్యాంసన్, అభిషేక్, ఫార్మాసిస్ట్ సుమన్, ప్రదీప్, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

దాళ్వాకు నీటి ఎద్దడి రాకుండా చర్యలు



ఏఏబీ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ శ్రీనివాస్

కొత్తపేట: ప్రస్తుత దాళ్వా పంటకు నీటి ఎద్దడి రాకుండా ముందస్తుగానే తగు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ సలహా మండలి (ఎంఏఏబీ) చైర్మన్ పెదపూడి త్రిమూర్తి శ్రీనివాస్ వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్ ఏడీ కార్యాలయంలో మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఎంఏఏబీ చైర్మన్ పెదపూడి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏడీఏ ఎం.వెంకటరామారావు పాల్గొన్నారు. పలు అంశాలపై చర్చించారు. రైతులు, సభ్యుల తరఫున చైర్మన్ శ్రీనివాస్ మాట్లాడుతూ న్యూ వాడపాలెం, ఓల్డ్ వాడపాలెం చానల్స్ ద్వారా కొత్తపేట, వాడపాలెం, వానపల్లి, బిళ్లకుర్రు గ్రామాల పరిధిలోని వరి పంట పొలాలకు నీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా చానళ్లకు వంతుల వారీ విధానంలో 24 గంటలు సాగునీటి సరఫరా సరిపోవడం లేదని, 48 గంటలు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆ మేరకు ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా ఎరువులు సరఫరా చేస్తుందని, మండలానికి ఎంత మేర వచ్చింది? అని ఆయన ఆరా తీశారు. మండలానికి మూడు డ్రోన్లు మంజూరయ్యాయని, ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆన్‌లైన్ అవ్వని పొలాలు త్వరితగతిన ఆన్‌లైన్ చేయాలని, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా కాలువలు, డ్రైన్లలో పూడిక తీత తదితర సమస్యలపై సమీక్షించారు. సమావేశంలో ఏఏబీ సభ్యుడు ఎంకే సుబ్రహ్మణ్యం, మండల వ్యవసాయ అధికారి (ఏఓ) పద్మలత, హెచ్‌ఓ ఎం.అనూష, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలి



అప్పనరామునిలంక బీజేపీ సమావేశంలో మాట్లాడుతున్న అయ్యాజీ వేమా

సఖినేటిపల్లి: వచ్చే ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే, ఆ పార్టీ సీనియర్ నాయకుడు మానేపల్లి అయ్యాజీ వేమా సూచించారు. శుక్రవారం అప్పనరామునిలంకలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు చెంపాటి శివరామకృష్ణంరాజు అధ్యక్షతన పార్టీ మండల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా వేమా మాట్లాడుతూ, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. కొబ్బరి రైతులను పట్టిపీడిస్తున్న తెల్లదోమ తెగులు నివారణకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. రేషన్ ఇచ్చే వాహనాలపై ప్రధాని మోదీ ఫొటోలను ఏర్పాటు చేయాలని సమావేశం తెలిపింది. పార్టీ రాష్ట్ర కో ఆపరేటివ్ సెల్ డైరెక్టర్ మాలే శ్రీనివాస నగేష్, జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు చెల్లింగి త్రినాథ్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొల్లాబత్తుల నాగ భూషణం, తిరుమల వెంకటేశ్వరరావు, పోతురాజు సురేష్, పట్టపు సూర్యప్రకాశరావు, చింతా మురళీ పలువురు నాయకులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాలతో సకల సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ శివకుమార్

మలికిపురం: సీఎం జగన్ ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సకల సేవలు అందుబాటులో ఉంటున్నాయని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్ పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో కాలువల్లో గుర్రపుడెక్క తొలగించి సాగునీరు సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. జిల్లా సభ్యుడు గుబ్బల రమేష్ మాట్లాడుతూ వ్యవసాయ సిబ్బంది సేవలు మెరుగ్గా ఉన్నాయని అన్నారు. ఇటీవల ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న మండల వ్యవసాయ అధికారి ఎస్.రాకేష్‌ను వేదికపై సన్మానించారు. మేడిచర్ల రాము, పశువైద్యాధికారి బి.శివకుమార్, గెడ్డం ఫిలిప్‌రాజు, సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

రాజోలు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎస్.హమారా ప్రసాద్ అనే వ్యక్తిపై రాజోలు పోలీస్‌స్టేషన్‌లో దళిత సంఘాల నాయకులు శుక్రవారం ఫిర్యాదు చేశారు. అంబేడ్కర్ రచనలను అవమానిస్తున్న సరిపల్లి రాజేష్, హమారా ప్రసాద్‌లను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దళిత సంఘాల నాయకులు బత్తుల మురళి, దీపాటి శివప్రసాద్, బత్తుల జనార్దనరావు, కొల్లాబత్తుల సతీష్, మట్టా సురేష్, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరిచెట్లు నరికిన వ్యక్తిపై కేసు

అయినవిల్లి: మండలంలోని క్రాప గ్రామంలోని ఓ రైతు తోటలో కొబ్బరి మొక్కలు నరికేసిన వ్యక్తిపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరావు తెలిపారు. దీనికి సంబంధించి ఎస్సై తెలిపిన వివరాల ప్రాకరం మండలంలోని క్రాప గ్రామానికి చెందిన చింతా వెంకటేశ్వరరావుకు చెందిన కొబ్బరి తోటలో మేడిపల్లి ప్రదీప్‌కుమార్ 32 కొబ్బరిచెట్లు నరికేశాడని అయినవిల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

ఐదేళ్ల కాల పరిమితితో లంక భూముల లీజు

పి.గన్నవరం: కొత్తపేట డివిజన్ పరిధిలో ఇంతవరకూ గుర్తించిన 666 ఎకరాల సీ–క్లాస్ లంక భూముల్ని 1966 మంది పేద రైతులకు ఐదేళ్ల కాల పరిమితికి లీజు పట్టాలు జారీ చేస్తున్నట్టు ఆర్డీఓ ఎం.ముక్కంటి తెలిపారు. శుక్రవారం ఆయన పి.గన్నవరం తహసీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గతంలో సీ–క్లాస్ లంక భూముల్ని ఏడాది మాత్రమే లీజుకు ఇచ్చేవారని వివరించారు. కొత్తపేట మండలం వానపల్లి, ఆత్రేయపురం మండలం ర్యాలి, రావులపాలెం మండలం పొడగట్లపల్లి, పి.గన్నవరం మండలం జి.పెదపూడి, ఊడిమూడి, బెల్లంపూడి, పి.గన్నవరం, మొండెపులంక, అంబాజీపేట మండలం తొత్తరమూడి, అయినవిల్లి మండలం శానపల్లిలంక, ఆలమూరు మండలం చొప్పెళ్ల లంక గ్రామాల్లో సీ–క్లాస్ లంకలను గుర్తించినట్టు ఆయన వివరించారు. ఆయన వెంట తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్ ఉన్నారు.

చెత్త నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఉప సర్పంచ్ మునిరెడ్డి తదితరులు

రావులపాలెం: గ్రామంలో ప్రతి ఒక్కరూ ఇళ్ల నుంచి వచ్చే చెత్తను ఏ విధంగా నిర్వహించాలి అనే అంశంపై అవగాహన పెంపొందించుకోవడంతో పారిశుధ్యాన్ని మెరుగుపర్చుకోవచ్చని రావులపాలెం సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డిలు అన్నారు. స్థానిక పంచాయతీ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద శుక్రవారం జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా వెల్ల, కొమరగిరిపట్నం గ్రామ పంచాయతీల సర్పంచులకు, సిబ్బందికి ఒకరోజు శిక్షణ, అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా శిక్షణా కేంద్రం నుంచి వచ్చిన సిబ్బంది తడి చెత్త, పొడి చెత్త నిర్వహణపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రజల నుంచి చెత్త నిర్వహణపై వివిధ అంశాలను పరిశీలించారు. అలాగే ప్రజలకు జీరో వేస్ట్‌పై రామచంద్రపురం డివిజనల్ పంచాయతీ అధికారి ఎం.రామకృష్ణారెడ్డి, అమలాపురం డివిజనల్ పంచాయతీ అధికారి జి.మల్లికార్జునరావులు అవగాహన కల్పించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద సిబ్బందికి వర్మీ కంపోస్టు తయారీ విధానంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్రి లక్ష్మీవెంకట నాగదేవి, జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఈఓపీఆర్‌డీ కృష్ణ, కార్యదర్శి దుర్గాప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అమలులోకి ఎన్నికల కోడ్



మలికిపురంలో రాజశేఖరరెడ్డి విగ్రహానికి ముసుగు వేస్తున్న అధికారులు

మలికిపురం: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేస్తున్నట్లు మలికిపురం పంచాయితీ కార్యదర్శి బొంతు శ్రీహరి తెలిపారు. శుక్రవారం ఆయన మలికిపురంలోని మాజీ సీఎం రాజశేఖర రెడ్డి విగ్రహంతో పాటు పలు విగ్రహాలకు ముసుగు వేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు హరికిషన్, అచ్యుత్ తదితరులు పాల్గొన్నారు.

నవగ్రహ నక్షత్ర పూజలు



విలసవిల్లిలో చైర్మన్ నాగేంద్రమణికి తీర్థం అందిస్తున్న పురోహితుడు

ఉప్పలగుప్తం: విలసవిల్లిలో రామాలయం వద్ద జరుగుతున్న నవగ్రహ నక్షత్ర పూజల్లో అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి దంపతులు పాల్గొన్నారు. యాగకర్త మున్నంగి రామకృష్ణ శర్మ సౌరయాగం విశిష్టతను ఆమెకు వివరించి, నక్షత్ర సంబంధిత పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు.

14న విగ్రహ ప్రతిష్ఠ

యానాం: స్థానిక గోపాల్‌నగర్, రామరాజు గార్డెన్స్‌లో నిర్మించిన ధనలక్ష్మి కల్యాణలక్ష్మి అమ్మవారి ఆలయ శిఖర, విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం 14న జరుగుతుందని ఆలయ ప్రతినిధులు తెలిపారు. ఆగమశాస్త్ర భాస్కర సుదర్శనం వెంకట జనార్దనాచార్యుల ఆధ్వర్యంలో చింతా వెంకటగణేష్, సీత, సాంబమూర్తి నాగరత్నకుమారి దంపతులచే జరుపుతామన్నారు. భక్తులు తరలి రావాలని కోరారు.

ఘనంగా కుంకుమ పూజలు

అమలాపురం రూరల్: అమలాపురం గాంధీనగర్‌లో కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన రావూరి ఉదయభాస్కర్, యేగి గంగానాగేశ్వరి దంపతుల ఆధ్వర్యంలో పండితులు పూజలు చేశారు. 200 మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అన్న సమారాధన జరిగింది. ఈ ఏర్పాట్లను ఆలయ కమిటీ ప్రతినిధులు తిక్కిరెడ్డి ఆదినారాయణ, సలాది సత్యనారాయణ, వడనగన సత్యానందం, కోరసాల బాబి పర్యవేక్షించారు.